సాక్షి నిజామాబాద్

బుధవారం । 3 । జనవరి । 2024



దరఖాస్తుల ఆన్‌లైన్..
ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.
- 8లో ▸



చేయిచేయి కలిపి..
జక్రాన్‌పల్లి ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో లాలన వృద్ధాశ్రమ అధ్యక్షుడు రాజిరెడ్డి రూ. కోటి విరాళమిచ్చారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.3 /16.9
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సమాచారం ఇవ్వకుండా సమావేశాలెందుకు?



రుద్రూర్: ప్రజలకు సమాచారం ఇవ్వకుండా 'మా సంకల్పం వికాసిత్ భారత్' సభను నిర్వహిస్తున్నారని బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రుద్రూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం 'వికసిత్ భారత్' సభను ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ప్రజాపాలన దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన వారిని కూర్చోబెట్టి సభను నిర్వహించడం ఎంత వరకు సమంజసమని నాయకులు అధికారులను ప్రశ్నించారు. సభ ప్రారంభించిన అనంతరం గ్రామంలో దండోరా వేయిస్తారా అంటు జీపీ కార్యదర్శి గంగాధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని అధికారుల హామీ ఇవ్వడంతో సభ యథావిధిగా కొనసాగింది. కార్యక్రమంలో సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, ఎంపీడీవో బాలగంగాధర్, ఎంఈవో శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంతమల్లన్నకు నైవేద్యాలు



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ జాతరలో సంతమల్లన్నకు భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. జాతర మరుసటి రోజున నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. అంక్సాపూర్ గ్రామస్తులతోపాటు ఆయా మండలాలలకు చెందిన భక్తులు తమ ఆరాధ్యదైవమైన సంతమల్లన్న స్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చారు. పంటలు సమృద్ధిగా ఇచ్చినందుకు పసుపు కొమ్ములు, గొర్రెలను సమర్పించారు. వచ్చే ఏడాది వరకు సల్లంగా చూడాలని వేడుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తన సతీమణితో కలిసి సంతమల్లన్నస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజాలు చేశారు. రాకేశ్‌రెడ్డి దంపతులను వీడీసీ సభ్యులు రాందాస్, పల్లె మహేశ్, సాక్కం మల్లారెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట వేల్పూర్ మండల మాజీ జెడ్పీటీసీ పాశపు రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

రెగ్యులర్ వీసీని నియమించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్-ఛాన్సలర్ (వీసీ)ని నియమించి, వర్సిటీ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. తెయూలో మంగళవారం పీడీఎస్‌యూ కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఇప్పటివరకు క్యాంపస్‌ను సందర్శించలేదన్నారు. పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు యూనివర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీందర్, అక్షయ్, మోహిత్, హన్మాండ్లు, రాకేష్, అఖిల్, గంగాధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అనునిత్యం అండగా ఉంటామని రాష్ట్ర పర్యటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం హత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు సాదుల రాములు కుటుంబ సభ్యులను మంత్రి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ తరఫున రూ. లక్ష ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కేసు విచారణ కోసం ప్రత్యేక బృందంతో వెంటనే విచారణ చేయాలని డీఎస్పీ జగన్నాథ్ రెడ్డిని ఆదేశించారు.





నగరంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద బారులు తీరిన వాహనదారులు


బంక్‌ల వద్ద బారులు..

- జిల్లాలోని పెట్రోల్‌బంక్‌ల వద్ద బారులు తీరిన వాహనదారులు
- పెట్రోల్, డీజిల్ కొరత లేదంటున్న డీలర్లు

సుభాష్‌నగర్ : దేశవ్యాప్తంగా లారీలు, ట్రక్కులు, ఆయిల్ ట్యాంకర్స్ అసోసియేషన్ సమ్మె వల్ల పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందనే ప్రచారంతో మంగళవారం వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద క్యూలు కట్టారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలోని 185 వరకు ఉన్న పెట్రోల్, డీజిల్ బంకులకు బారులు తీరారు. సమ్మెపై ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత లేకపోయినా.. ఆ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. కాగా ఎలాంటి సమ్మె లేదని, ఆయిల్ ట్యాంకర్ల ద్వారా బంకులకు సరఫరా మొదలైందని, సమ్మె ఇప్పటికే విరమించారని, కొరత అనేది కేవలం దుష్ప్రచారమని డీలర్లు కొట్టిపారేస్తున్నారు. డీఎస్ఓ చంద్ర ప్రకాశ్‌ను వివరణ కోరగా, 'కొత్త వాహన చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారని ప్రచారం జరుగుతోందన్నారు. పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని, వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. సరిపడా జిల్లాకు చమురు వస్తుందన్నారు.

కేబినెట్‌లో ఇద్దరికి చాన్స్!

కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా ఉన్న సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖరారు కాగా రెండోవిడతలో ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ తన సొంత నియోజకవర్గమైన కామారెడ్డి స్థానాన్ని రేవంత్ రెడ్డి పోటీ చేయడానికి త్యాగం చేశారు. షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నుంచి నిలబడి ఓటమి చెందారు. పైగా మైనారిటీ కోటాలో ఆయనకు మంత్రివర్గంలో స్థానం దక్కనున్నట్లు సమాచారం. ఉత్తర తెలంగాణ నుంచి బీసీ వర్గానికి చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీకి మంత్రి పదవులు దక్కే అవకాశం
- జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల కోసం సీనియర్ నేతల ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మొదటి విడతలో మంత్రి పదవులు దక్కని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు విస్తరణలో ఏకంగా రెండు బెర్త్‌లు దక్కనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బోధన్ నుంచి నాలుగోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి, సీనియర్ నేత షబ్బీర్ అలీకి రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కనున్నట్లు తెలుస్తోంది. పైగా వీరిద్దరూ రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు. పార్టీ అధినాయకత్వం వద్ద సైతం వీరిద్దరికి మంచి పలుకుబడి ఉండడంతో కచ్చితంగా చాన్స్ దక్కనున్నట్లు సమాచారం. వీరిద్దరూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లలో పనిచేశారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్‌గా ఉన్న సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖరారు కాగా రెండోవిడతలో ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక షబ్బీర్‌అలీ తన సొంత నియోజకవర్గం కామారెడ్డి స్థానాన్ని రేవంత్ రెడ్డి పోటీ చేయడానికి త్యాగం చేశారు. షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. సీటును త్యాగం చేయడంతో పాటు మైనారిటీ కోటాలో షబ్బీర్‌కు కేబినెట్‌లో బెర్త్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. షబ్బీర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లో అవకాశమిస్తే కామారెడ్డితో పాటు నిజామాబాద్ అర్బన్‌లో సైతం పార్టీ కేడర్‌కు భరోసా ఇచ్చినట్లేనని పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే మంత్రివర్గ విస్తరణ లోక్‌సభ ఎన్నికలకు ముందు చేస్తారా.. తరువాత చేస్తారా అనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు.

మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి?

ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తున్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి దక్కనున్నట్లు తెలుస్తోంది. మైనారిటీ అభ్యర్థిని నిలబెట్టిన నేపథ్యంలో అధినాయకత్వం సూచన మేరకు మహేశ్‌కుమార్ గౌడ్ నిజామాబాద్ అర్బన్ టికెట్టును త్యాగం చేశారు. పైగా పార్టీ ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. గతంలోనే పార్టీ అధినాయకత్వం మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు పీసీసీ పీఠం సైతం అప్పగించేందుకు పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. నలభై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించి ఆ తరువాత మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ పీఠం అప్పగిస్తారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఓసీ కావడంతో పాటు దక్షిణ తెలంగాణ నుంచి ఉండడంతో ఉత్తర తెలంగాణ నుంచి బీసీ వర్గానికి చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు తప్పనిసరిగా పీసీసీ పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ నాయకులు, శ్రేణులు, గాంధీభవన్ వర్గాలు చెబుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నాయకులు నామినేటెడ్ పదవుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

రేపు చైర్‌పర్సన్‌పై 'అవిశ్వాసం'..!

- ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దింపుతామంటున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- మాకేం సంబంధం లేదంటున్న కాంగ్రెస్ పార్టీ
- ఐదుగురు బీజేపీ కౌన్సిలర్లలో ఒక కౌన్సిలర్ అదృశ్యం

ఆర్మూర్ : ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించడానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఓడిపోగా బీఆర్ఎస్ కౌన్సిలర్లలో చైర్‌పర్సన్ వినీత పవన్ దంపతులపై అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. 24 మంది కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సూచన మేరకు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం పెడుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీంతో కలెక్టర్ గురువారం సమావేశానికి నిర్ణయించారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్ స్థానాలు ఉండగా 2020 జనవరిలో నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 23 స్థానాలు, బీజేపీ ఆరు స్థానాలు, కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం ఒక్కో స్థానం, ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. ఐదుగురు స్వతంత్ర కౌన్సిలర్లతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఒక్కొక్కరు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో ఎంఐఎంను కలుపుకొని బీఆర్ఎస్ పార్టీ బలం 30 కౌన్సిల్ స్థానాలకు చేరింది. బీసీ మహిళ రిజర్వ్‌డ్ అయిన చైర్‌పర్సన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుని వినీతను చైర్‌పర్సన్‌గా గెలిపించుకున్నారు. 24 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అంగీకరిస్తూ సంతకాలు చేసినప్పటికీ రెండు గ్రూపుల బలాబలాలపై స్పష్టత రావడం లేదు. మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత పవన్ దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రక్రియ తమకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్‌రెడ్డి ఓ సమావేశంలో పేర్కొన్నారు.

చైర్‌పర్సన్ వినీత శిబిరంలో ఉన్న కౌన్సిలర్లు మాట్లాడుతూ బీఆర్ఎస్ శిబిరంలో కేవలం 20మంది కౌన్సిలర్లు ఉన్నారని, అవిశ్వాస తీర్మానం వీగిపోతుందని అంటున్నారు. ప్రస్తుతం రెండు గ్రూప్‌ల కౌన్సిలర్లను క్యాంప్‌లకు తరలించారు. మాత్రమే ఉన్నారు. కాబట్టి అవిశ్వాస తీర్మానం వీగిపోతుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు గ్రూపుల కౌన్సిలర్లను రహస్య ప్రదేశాల్లోకి క్యాంపులకు తరలించారు.

నేడు బీజేపీ కౌన్సిలర్లతో సమావేశం..

మరోవైపు చైర్‌పర్సన్ కుటుంబానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బీజేపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్ల మద్దతు కోరుతున్నట్లు సమాచారం. మరో వైపు ఐదుగురు బీజేపీ కౌన్సిలర్లలో 29వ వార్డు కౌన్సిలర్ చైర్‌పర్సన్ శిబిరంలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన ఫోన్ స్విచ్ఆఫ్ ఉండటం, స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రచారానికి బలం చేకూరుతోంది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి బీజేపీ కౌన్సిలర్లతో మంగళవారం రాత్రి సమావేశం కానున్నారు. మున్సిపల్ రాజకీయాల్లో తాము పోషించాల్సిన పాత్రపై నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి



కుద్వాన్‌పూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నందిపేట్/ఆర్మూర్‌టౌన్ /పెర్కిట్ : గ్రామాల్లో స్వీకరిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులపై ప్రజలకు సందేహాలుంటే అధికారులు, సిబ్బంది నివృత్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మంగళవారం నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్, వన్నెల్ కే గ్రామంలో, ఆర్మూర్ పట్టణంలో, ఆలూర్ మండలం మచ్చర్లలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు సరిపోతుందని, జీపీ కార్యదర్శుల ద్వారా ప్రతిఇంటికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, ఎంపీడీవో నాగవర్ధన్ సిబ్బంది ఉన్నారు.

నాలుగోరోజు 89,058 దరఖాస్తులు..

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం నాలుగో రోజు ఆరు గ్యారెంటీలపై 89,058 దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటివరకు మొత్తం 2,85,891 దరఖాస్తులు వచ్చాయని డీపీవో జయసుధ తెలిపారు. మిగితా సమస్యలపై మంగళవారం ఒక్కరోజే 18,875 దరఖాస్తులు వచ్చాయన్నారు.

'మధ్యాహ్నం'.. మరింత భారం..

- పెరిగిన ధరలతో ఏజెన్సీల తిప్పలు
- ఒక్కో విద్యార్థికి ప్రతిరోజూ రూ. 16.84 ఖర్చు
- అధికారులు చెల్లిస్తుంది రూ. 7.95 పైసలే..
- పెండింగ్ బిల్లులతో ఇబ్బందులు



కలెక్టరేట్ వద్ద బిల్లులు మంజూరు చేయాలని నిరసన తెలుపుతున్న ఏజెన్సీ నిర్వాహకులు(ఫైల్)



ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారు. పెరిగిన ధరల వల్ల కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు నాణ్యమైన ఆహారాన్ని అందించలేకపోతున్నారు. మరోవైపు ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో రోజువారి భోజనానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పెరిగిన ధరలతో ఇబ్బందులు

జిల్లాలోని 1,724 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. రెండున్నర లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా వీరికి ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1 నుంచి 5వ తరగతి విద్యార్థికి ప్రతిరోజూ రూ. 5.45 పైసలు చెల్లిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 8.15 పైసలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ప్రతి రోజూ రూ.16.84 పైసలు ఖర్చవుతుంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 19.44పైసలు ఖర్చవుతుంది. కాగా వారంలో మూడు రోజులు గుడ్లు అందించాల్సి ఉంటుంది. దీనికి రూ. 15 ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రస్తుతం ఒక్కో గుడ్డు ధర రూ. 7కు పెరిగింది. దీంతో మూడు రోజులకు రూ. 21 ఖర్చవుతుంది. అదనంగా ఒక్కో విద్యార్థిపై రూ. 6 భారం పడుతుంది. పప్పులు, కూరగాయలు 1 నుంచి 10 విద్యార్థులకు రోజుకు రూ. 40 చెల్లిస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరల వల్ల రూ. 150 అధికంగా ఖర్చవుతుంది. మంచినూనె, చింతపండు రోజుకు రూ. 140, కారం రూ. 300 ఖర్చవుతుంది. పెరిగిన ధరలతో ఏజెన్సీల నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు.గత ప్రభుత్వం మధ్యాహ్న ఏజెన్సీల స్లాబ్ రేటు పెంచినట్లు అమలులోకి రాలేదు. పెరిగిన ధరల ప్రకారం ఒక్కో విద్యార్థికి రూ. 20స్లాబ్ రేటు పెంచితేనే మంచి ఆహారం అందే అవకాశం ఉంది. శనివారం, గురువారం బిర్యానీ, కిచిడీ విద్యార్థులకు అందించాల్సి ఉండగా ఒక్కో విద్యార్థిపై అదనంగా భారం పడడంతో కొన్ని పాఠశాలల్లో వడ్డించడంలేదు. దీనికి తోడు గత ఆరు నెలల నుంచి ఏజెన్సీలకు రావాల్సిన రూ. 15 కోట్ల బకాయిలు రావడం లేదు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ఏజెన్సీ నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో నామమాత్రంగా పప్పు, చారుతో భోజనం అందిస్తున్నారు. గుడ్లు కూడా సక్రమంగా అందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పెరిగిన ధరల ప్రకారం ఇవ్వాలి



ఇటీవల పెరిగిన ధరల వల్ల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ఆర్థికంగా ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వమే పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లు లు చెల్లించాలి. కొన్ని నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అలాగే పెండింగ్‌లో ఉన్న బకాయి లు తక్షణమే చెల్లించాలి.

– చక్రపాణి,
ఎండీఎం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లాకు మరో రెండు నర్సింగ్ కాలేజీలు

- ఆర్మూర్, భీమ్‌గల్ వంద పడకల ఆస్పత్రుల్లో ఏర్పాటు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో విద్యార్థుల్లో హర్షం



ఆర్మూర్‌లోని 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం

ఆర్మూర్ : వంద పడకల ఆస్పత్రులకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామంటూ కొత్త ఏడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు బోధన్‌లో ఇప్పటికే ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు కొనసాగుతున్నాయి. తాజాగా ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లోని వంద పడకల ఆస్పత్రులకు అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయి. వైద్యరంగంలో డిమాండ్ ఉన్న నర్సింగ్ కోర్సు చదవడానికి ఆర్మూర్‌లో గతంలో ఒక ప్రైవేట్ కళాశాల అందుబాటులో ఉండేది. ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి ఇక్కడ నర్సింగ్ చదివేవారు. ప్రైవేటు యాజమాన్యం ఈ కళాశాలను డిచ్‌పల్లి సమీపంలోని బర్ధిపూర్‌లోని సొంత భవనానికి మార్చింది. దీంతో పేద విద్యార్థులకు మూడేళ్ల కాల పరిమితి ఉన్న నర్సింగ్ చదవడానికి అవకాశం ఉండేది కాదు. తాజాగా సీఎం ప్రకటనతో ఆర్మూర్, భీమ్‌గల్‌లో నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి ఆస్కారం ఉంది. ఇంటర్, ఒకేషనల్ చదువును పూర్తి చేసుకున్న విద్యార్థులు నోటిఫికేషన్‌కు అనుగుణంగా దరఖాస్తు చేసుకుంటే మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించే అవకాశం ఉంది. ప్రైవేటు ఆస్పత్రుల నిర్మాణాలు అధికంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో విదేశాల్లో కూడా ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి మంచి వేతనాలతో ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థులకు ఉపయోగం



వంద పడకల ఆస్పత్రులు అందుబాటులో ఉన్న ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లో నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి ఆస్కారం ఉంటుంది. గ్రామీణ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– డాక్టర్ రమేశ్,
డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, ఆర్మూర్

క్లుప్తంగా

తగ్గిన నీటి విడుదల

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి వారబంధీ ప్రకారం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం తగ్గించారు. మొదటి జోన్ కోసం కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200, సరస్వతి కాలువ ద్వారా 500, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 472, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, ఆవిరి రూపంలో 389 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు)అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1086.20(70.67 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



మాక్లూర్: జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు మండలంలోని గుత్ప ప్రభుత్వ పాఠశాల విద్యార్థి భార్గవ్ ఎంపికయ్యాడు. పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో భార్గవ్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు అభినందించారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు న్యూఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో నిర్వహించే జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం ద్రుపతి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట చిన్నయ్య, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఉపసర్పంచ్ రాఘవేందర్‌రావు, పాఠశాల చైర్మన్ రమేశ్, వీడీసీ సభ్యులు ధర్మన్న, రాజన్న, ఉపాధ్యాయులు గిరిరాజ్, నరేందర్‌రావు, అంజనేయగౌడ్, శ్రీనివాస్, విష్ణుమూర్తి, నరేశ్, ప్రవీణ్ కుమార్, పీఈటీ సునీల్ పాల్గొన్నారు.

జడ్జికి శుభాకాంక్షలు తెలిపిన సీపీ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టు కార్యాలయంలో జడ్జి సునీత కుంచాలను కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ శింగెనవార్, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ జయరాం మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏఆర్) గిరిరాజు, పరిపాలన అధికారి (ఏఓ) శ్రీనివాస్, సీటీసీఏసీపీ టీఎస్ శ్రావణ్ కుమార్, నిజామాబాద్ ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, సీసీఆర్‌బీ ఏసీపీలు కిరణ్ కుమార్, నారాయణ, రాజశేఖర్‌రాజు, రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సిబ్బంది ఉన్నారు.

చేయిచేయి కలిపి.. బడిని నిర్మించి..

- రూ. మూడు కోట్లతో జక్రాన్‌పల్లి ఉన్నత పాఠశాల నిర్మాణం
- రూ. కోటి విరాళంగా ఇచ్చిన పైపుల రాజిరెడ్డి
- మరో రూ. 75 లక్షలు ఇచ్చిన కుటుంబీకులు
- సహకారం అందించిన మరికొందరు దాతలు
- సర్వాంగ సుందరంగా పాఠశాల సిద్ధం



దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఉన్నత పాఠశాల

జక్రాన్‌పల్లి: ఎవరో రావాలి ఏదో చేయాలి అని ఎదురు చూడకుండా.. చేయి చేయి కలిపారు. సమష్టిగా జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని తలంచారు. అనుకున్నదే తడవుగా లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త గడ్డం రాజిరెడ్డి(పైపుల) అందుకు కేంద్ర బిందువుగా నిలిచారు. తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని సదుద్దేశంతో గతేడాది ఫిబ్రవరి 23న వసంత పంచమి రోజు పాఠశాల పునర్నిర్మాణం కోసం అంకురార్పణ చేశారు. పాఠశాలలో స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా పైపుల రాజిరెడ్డి, సభ్యులుగా పీడీ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గంగారెడ్డి, ఉపసర్పంచ్ బాల్‌కిషన్, డాక్టర్ సుభాష్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజిరెడ్డి పాఠశాల అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. అందుకు గ్రామాభివృద్ధి కమిటీ, కుల సంఘాల సహకారం తోడయ్యింది. గ్రామంలోని ప్రతిఒక్కరూ పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు సహాయాన్ని అందజేశారు. వ్యాపారవేత్త రాజిరెడ్డి రూ. కోటి నగదును అందించగా వారి కుటుంబ సభ్యులు మరో రూ. 75 లక్షలను అందజేశారు.

మరికొంత మంది దాతల సహకారంతో సుమారు రూ. మూడు కోట్లతో పాఠశాలను అభివృద్ధి చేశారు. స్కూల్‌లో 20 తరగతి గదులను నిర్మించారు. డైనింగ్ హాల్, తాగునీటి సౌకర్యం, వేదిక, మరుగుదొడ్లు, ప్రత్యేకమైన వంటశాలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో డిజిటల్ విద్యాబోధనకు అనుకూలంగా తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. సీసీ కెమెరాలను ఏర్పాటు సైతం చేశారు. డెస్క్ బెంచీలను సమకూర్చారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పాఠశాలను అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

రేపు రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా ప్రారంభం

జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునః ప్రారంభోత్సవానికి ఈ నెల 4న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పైపుల రాజిరెడ్డి, సభ్యులు ఉమామహేశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, బాల్‌కిషన్ తెలిపారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎంపీ అర్వింద్, మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, జెడ్పీ చైర్మన్ విఠల్, స్థానిక జెడ్పీటీసీ తనుజారెడ్డి, ఎంపీపీ విమల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు హాజరుకానున్నట్లు తెలిపారు.

నీరు వృథా.. తప్పని వ్యథ

- ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- లక్ష్మి మైనర్ కాలువల నుంచి వృథాగా పోతున్న వైనం



కాలువపై నుంచి ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు విడుదల చేస్తున్న నీరు వృథాగా పోతుండడంతో సాగు చేస్తున్న పంటలు నీటితో మునిగిపోతున్నాయి. దీంతో రైతులు పంటలను నష్టపోతున్నారు. ఎస్సారెస్పీ అధికారులు ఆయకట్టు రైతులు సాగుచేస్తున్న యాసంగి పంటల కోసం లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేపట్టారు. దీంతో డి-4 కాలువలోని ఎల్-2 కాలువలో నీటి ప్రవాహం ఎక్కువై వృథాగా పోతోంది. ఈ నీరు పంట పొలాలకు చేరడంతో రైతులు సాగు చేసిన పంటలను నష్టపోతున్నారు. డి-4 కాలువ చివరలో మరమ్మతులు చేపడుతుండగానే నీటి విడుదలను అధికారులు చేపట్టారు. దీంతో కాలువలో నీటిని మళ్లించే ప్రయత్నంలో ఎల్-2 కాలువకు మళ్లించారు. ఫలితంగా కాలువలో నీరు ఎక్కువై పంట పొలాలకు చేరుతోంది. దీంతో పంటలు మునిగిపోయాయి. ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచిస్తున్న అధికారులు మాత్రం ఆచరణలో అవేవి తమకు వర్తించవన్నట్లు వ్యవహరిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

కాలువల ద్వారా నీటి విడుదలను పర్యవేక్షించే అధికారులు, సిబ్బంది పట్టించుకోక పోవడంతో నీరు ఎక్కువ, తక్కువ పెంచుతూ నీటిని వృథా చేస్తున్నారు. గత ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తూ వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించింది.

అందులో భాగంగా అనేక మంది వీఆర్ఏలను ఇరిగేషన్ శాఖకు అప్పగించింది. దీంతో లక్ష్మికాలువకు ఆరుగురు ఎంఎం(మ్యాన్ మజ్దూర్)లు వచ్చారు. కానీ పర్యవేక్షణ మాత్రం కనబడడం లేదు. ప్రతి కాలువ వెంబడి నిత్యం పర్యవేక్షణ ఉంటే నీరు వృథాగా పోకుండా ఉంటుంది. కానీ ఆచరణలో మాత్రం అలా జరగడం లేదు. మైనర్ ఉప కాలువ ద్వారా ఎక్కువగా వదలడంతో వృథాగా పోతున్న నీరు పెద్దవాగులో కలుస్తోంది. ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌లో 15 రోజుల వ్యవధిలోనే 9 టీఎంసీల నీరు ఖాళీ అయింది. అంటే విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వృథాగా పోతున్న నీటిపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

> **తోటలకు నీరు వస్తోంది**
>
> 
>
> కాలువ ద్వారా నీటిని ఎక్కువగా వదలడంతో పంట పొలాలకు వస్తోంది. తోటలకు కూడా నీరు చేరడంతో పంటలకు నష్టం జరుగుతోంది. నీటి ప్రవాహంతో ఎక్కువగా ఉండడంతో వేసిన చిన్న దారులు తెగిపోతున్నాయి. అధికారులు నీటి వృథాను అరికట్టాలి.
>
> – నద్ముడ నర్సయ్య, ఆయకట్టు రైతు

దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాల్సిందే..



కమ్మర్‌పల్లిలో దరఖాస్తుదారులకు సాయం చేస్తున్న స్థానిక నాయకులు

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. జీపీలు, మున్సిపల్‌లో ఈనెల 6వ తేదీ వరకు ప్రజా పాలన కొనసాగనున్న విషయం విదితమే. ప్రజా పాలనలో అభయహస్తం హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది. గడిచిన నెలలో ఆరంభమైన ప్రజా పాలన ఈనెల 6తో ముగియనుంది. రేషన్‌కార్డులు, కార్డులలో పేర్ల మార్పులు చేర్పులు, పింఛన్లు, మహాలక్ష్మి సాయం, రూ.500లకు సిలెండర్లు, రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు సాయం, కొత్త పింఛన్, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం ఇలా పలురకాల హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ఆరంభం కాగా మరో నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. దరఖాస్తులను స్వీకరించి ఆర్జిదారులకు రసీదులను అందిస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమం ముగిసిపోగానే దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమం ముగిసే నాటికి ఏ పోర్టల్‌లో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలు అందాయని దీనిపై తొందరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

జాతీయ సాహస శిబిరంలో తెయూ వలంటీర్లు



తెయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

తెయూ(డిచ్‌పల్లి): హిమాచల్‌ప్రదేశ్‌లో నేటి నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సాహస శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు తెయూకు చెందిన 10 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బయలు దేరినట్లు ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. శిబిరంలో తెయూతో పాటు అనుబంధ డిగ్రీ/పీజీ కళాశాలలకు చెందిన సురేశ్, వినోద్, ఎల్.సంతోష్, రాజేశ్వరి, ఎన్.దీపిక, ఎస్.భార్గవి, ఎన్. విజ్ఞాన, జి.రక్షిత, కె.రవితేజ, ఎండీ సమర్ అహ్మద్ ఉన్నట్లు ఆయన తెలిపారు. బృందానికి కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ శారద (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామారెడ్డి) వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వీరు అటల్‌బిహారీ వాజ్‌పేయ్ పర్వతారోహణ శిక్షణ శిబిరంలో రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, స్కేయింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటి అంశాల్లో శిక్షణ పొందనున్నారు. శిబిరంలో ప్రతి రోజూ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



రిజిస్ట్రార్‌కి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పాలకమండలి (ఈసీ) నిర్ణయాలను వెంటనే అమలు చేసి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వర్సిటీ ఏబీవీపీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలల తరగతులను బహిష్కరించి రిజిస్ట్రార్ చాంబర్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బచ్చన బోయిన శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వర్సిటీ అధికారులు, సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలకు నూతన వసతి గృహం, ఆడిటోరియం నిర్మించాలన్నారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, ప్రయోగశాలలు మెరుగుపర్చాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయికృష్ణ, ప్రమోద్, అమృత్‌చారి, సింహాద్రి, సాయికుమార్, నరేశ్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ యువజన ఉత్సవాలకు వర్సిటీ విద్యార్థులు



శరణ్యను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): మహారాష్ట్రలో ఈ నెల 12 నుంచి 16వరకు నిర్వహించే 27వ జాతీయ యువజన ఉత్సవాలకు తెయూ పరిధి నుంచి టి.శరణ్య, వి.రేవంత్‌చారి ఎంపికైనట్లు వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తెయూ తరఫున ఎంపికైన వీరు మిగిలిన యూనివర్సిటీలతో కలిసి తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రధానంగా వివిధ సంస్కృతులు, కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. యువజన ఉత్సవాలకు ఎంపికైన శరణ్య, రేవంత్‌చారిలను రిజిస్ట్రార్ యాదగిరి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి అభినందించారు.

ఎండీఎం బిల్లులు మంజూరు చేయాలి



సుభాష్‌నగర్: తెలంగాణ మధ్యాహ్నభోజన పథకం బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరి చక్రపాణి డిమాండ్‌చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సాయమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు హన్మాండ్లు, గంగాధర్, లలిత, నాగలక్ష్మి, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య వాగ్వాదం

ఆర్మూర్ టౌన్: పెర్కిట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సిబ్బంది, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధిత కుటుంబ సభ్యుల మధ్య మంగళవారం వాగ్వాదం చోటు చేసుకుంది. సీఐ సురేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లికి చెందిన లక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సిబ్బంది సకాలంలో స్పందించలేదని బాధిత కుటుంబీకులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

మట్కా నిర్వాహకుల అరెస్టు

బోధన్‌టౌన్: పట్టణంలోని రెంజల్ బేస్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేసినట్లు సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. పట్టణంలోని రెంజల్ బేస్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో నిర్వాహకులు రియాజ్ , ఖాసీమ్, నయీమొద్దీన్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ. 5200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా వడ్లు తరలిస్తున్న లారీ పట్టివేత



వర్ని: మండల కేంద్రంలో అక్రమంగా రైస్‌మిల్ నుంచి వడ్లను తరలిస్తున్న ఓ లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. కోటగిరి మండలంలోని ఓ రైస్ మిల్ నుంచి 374 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని అక్రమంగా మిర్యాలగూడకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు డీటీ నిఖిల్‌రాజ్ తెలిపారు. రైస్ మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన వడ్లను అక్రమంగా అమ్ముకుంటున్నారన్న సమాచారం మేరకు లారీని తనిఖీ చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అధికారుల వెంట వర్ని ఎస్సై కృష్ణకుమార్, డీటీ అశ్వక్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



నెనావత్ బంటు (ఫైల్)

రెంజల్: మండల కేంద్రానికి చెందిన అగ్గు శంకర్(45) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. తాగుడుకు బానిసైన శంకర్ తరచూ భార్యతో గొడవపడేవాడు. డిసెంబర్ 31న ఇంట్లో గొడవల కారణంగా పురుగుల మందు సేవించిన శంకర్ అపస్మారకస్థితికి చేరాడు. గమనించిన కుటుంబీకులు, చుట్టుపక్కల వారు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంచిప్ప తండాలో మరొకరు..

మోపాల్: మండలంలోని మంచిప్ప తండాకు చెందిన నెనావత్ బంటు (16) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బంటు పదో తరగతి వరకు చదివి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. గత డిసెంబర్ 24న చెట్టు కొమ్మలకు గాలిపటం చిక్కుకుందని తీసేందుకు వెళ్లగా కొమ్మ విరిగి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కుటుంబీకులు, గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి.

వరదకాలువలో పడి యువకుడు..



అజేశ్ (ఫైల్)

మోర్తాడ్: మండల శివారులోని వరద కాలువలో పడి అజేశ్(23) అనే యువకుడు మృతిచెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలానికి చెందిన అజేశ్ మండల కేంద్రంలో రక్త, మూత్ర పరీక్షల ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. గతంలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేసిన అతను కొన్ని కారణాలతో బయటకు వచ్చి సొంతంగా ల్యాబ్ పెట్టాడు. ఆస్పత్రిలో పనిచేసినప్పుడు నిర్వాహకులతో ఆర్థిక లావాదేవీల విషయమై గొడవ జరిగినట్లు తెలిసింది. మనస్తాపానికి గురైన అజేశ్ మూడు రోజుల క్రితం కనిపించకుండాపోయాడు. కుటుంబ సభ్యులు మోర్తాడ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం వరదకాలువలో మృతదేహం లభించడంతో మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. ఇదిలా ఉండగా ఆస్పత్రి నిర్వాహకులు వేధింపులతోనే తమ కుమారుడు మరణించినట్లు మృతుడి తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబీకులు ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పెద్దకొడప్‌గల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై కోనారెడ్డి మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని బిచ్కుంద ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ డివిజన్ పౌరసరఫరా శాఖ అధికారి ఎండీ ఖాలేద్ తెలిపారు. ఎవరైనా రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. వారి వెంట అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

దూపల్లిలో ఇసుక ట్రాక్టర్..

రెంజల్: దూపల్లి గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఇసుకను తరలిస్తున్న సమాచారం అందడంతో దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌కు పీఎస్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పోలీసుల అదుపులో మరో ఇద్దరు 'కొకైన్' నిందితులు

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి పీఎస్ పరిధిలో డిసెంబర్ 31న టాస్క్‌ఫోర్సు పోలీసులు కొకైన్‌తో పాటు మాదకద్రవ్యాలను పట్టుకున్న కేసులో మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు కొకైన్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను తరలిస్తున్న నిందితులను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. నడిపల్లి తండా వద్ద దొరికిన ఇద్దరు నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటికే గంజాయి విచ్చలవిడిగా అమ్ముతుండగా కొకైన్‌తో పాటు మత్తుపదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం కలకలం రేపుతోంది.

మోగిన సైరన్.. దొరికిన దొంగ



బ్యాంకులోకి చొరబడిన దొంగ



బ్యాంకు వద్దకు తరలివచ్చిన గ్రామస్తులు

ధర్పల్లి: బ్యాంకులో చోరీకి పాల్పడేందుకు వెళ్లిన ఓ దొంగ సైరన్ మోగడంతో పోలీసులకు చిక్కిన ఘటన మండలంలోని దుబ్బాక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి సోమవారం రాత్రి బ్యాంకు తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డాడు. వెంటనే బ్యాంకు మేనేజర్ రాజు సెల్‌ఫోన్‌కు సైరన్ మోగింది. వెంటనే అతను పోలీసులు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులను చూసిన దొంగ తనను కొడతారేమోననే భయంతో లోపలే ఉండిపోయాడు. తాను జిల్లా కేంద్రంలో మద్యం సేవిస్తున్న చోట బిహార్ ముఠా సభ్యులు పరిచయమయ్యారని పోలీసులతో చెప్పాడు. వారు బ్యాంకులో దొంగతనం చేద్దామని చెప్పి తనను తీసుకొచ్చారని తనతో పాటు పది మంది బిహార్ సభ్యులు ఉన్నట్లు నమ్మబలికాడు. దీంతో వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏసీపీ కిరణ్‌కుమార్‌తో పాటు ధర్పల్లి సీఐ సైదా, సిరికొండ, జక్రాన్‌పల్లి, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, టూటౌన్ ఎస్సైలు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. బిహార్ గ్యాంగ్ వారు ఎక్కడున్నారని సీఐ ప్రశ్నించగా బాత్‌రూంలో ఉన్నట్లు చెప్పాడు. వెనుకవైపు ఉన్న కిటికీలో నుంచి సీఐ చూడగా అందులో ఎవరూ లేరు. లోపల ఒకరే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఊపిరి పీల్చుకుని నిందితుడిని అరెస్టు చేశారు. సంతోష్‌రెడ్డిపై రెంజల్ పీఎస్‌లో పాత కేసులు ఉన్నట్లు తెలిపారు. బ్యాంకులో ఎలాంటి సొత్తు చోరీకి గురి కాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.